# ఆదర్శగృహిణి

శ్రీమతి పాకల రాజామణెమ్మగారు

ఇప్పటికి పదమూడు పదునాల్గు సంవత్సరములకుముందు నేను బెజవాడలో మాపిన తల్లిగారింట నున్నప్పుడు మాపొరుగున నొక వకీలుగారి భార్యకును నాకును స్నేహమయ్యెను. యువకులు మొదలు వృద్ధులవరకు సహాయనిరాకరణోద్యమమున వెనుకంజవేయక యుద్రేకులై పనిచేయ మొదలుపెట్టుచుండినదినములవి. ఉద్యోగస్థు లుద్యోగములు వదలుచుండిరి. విద్యార్థులు విద్యాలయములు విడిచిపెట్టుచుండిరి. ఆవకీలుగారును తమ వృత్తినివదలి యుత్సాహముతో సహాయనిరాకరణోద్యమమున ప్రవేశించిరి. కారణాంతరములవలన నేనప్పుడాయూరువదలి మరల నాల్గుసంవత్సరములకాయూరుపోతిని గాని వారాయింటలేరు. నాకామెను జూడవలెనను యాశచేత వారుండు తావు తెలుసుకొని వారింటికిపోతిని. నన్ను చూడగానే యామె యాదరించి లోనికి తోడ్కొనిపోయి కూర్చుండబెట్టి కుశలప్రశ్నలైనతర్వాత "మీరా యిల్లువదలి యూరికింతదూరమునవున్నా రెందుకు. ఈ తోటా యిల్లూకొన్నారా"యని నేనడిగినాను. అందులకామె యీ నాల్గుసంవత్సరములలో జరిగిన తమ సంసారస్థితిగతులను వివరించి చెప్పెను. ఆసంగతులన్నియు స్త్రీలకాదర్శకరములుగనున్నవని వాటిని వివరింప బూనుకొంటిని.

"మా వారు సహాయనిరాకరణమున జేరి యుద్యోగముమాని చేతనున్న డబ్బంతయు ఖర్చుపెట్టిరి. ఆ వుద్రేకమంతయు చల్లారి యెవరిమట్టుకు వారు వేరువేరు మార్గము లనుసరించుచున్నప్పుడు మా సంసారముగడచు మార్గములేకుండెను. తిరిగి వకీలువృత్తి నవలంబించిన ధనమురాదు. అందువలన యేమియుదోచక నా భర్త ఖిన్నులైయుండిరి. నేను రెండువేల ఖరీదుగల నానగలను వారిచేతబెట్టి 'యిప్పుడు వేలమువేయుచున్న ఖాళీస్థలములలో నొక దానినికొని యక్కడ చిన్నయిల్లు కట్టండి. మనమచ్చట కాపురముండి మిగతధనముతో జీవనోపాయము చూచుకొందము. పిత్రార్జితమగు పొలములో పండివచ్చు ధాన్యము మనకు సంవత్సరమునకు సరిపోవును' అని ప్రోత్సాహపరచితిని. ఆయనట్లే యీ నేలకొని చిన్నయిల్లు కట్టినారు. దొడ్డి చుట్టూ ప్రత్తిచెట్లూ టెంకాయచెట్లూ వేయించి తక్కిన భూమిలో కాయగూరలు మొదలైనవి పెట్టించితిమి. రెండావులను గేదెను పాడికి కొనుక్కొనినాము. ఒక సంవత్సరమువరకు కొంచము కష్టపడినాము. ఇప్పుడు మాబిడ్డలతో మేము సుఖజీవనము చేయుచున్నాము. నేను వేకువనేలేచి పాచి పనులు జేసికొని పశువులకు మేతవేసి పాలు పిండి పెరుగుచిలికి వెన్నతీసి బిడ్డలకు చలిది

యన్నముపెట్టి వారి పనులన్నియుజేసి నేను స్నానముచేసి దేవతార్చనచేసుకొని వంట చేయుదును. నాభర్తగారును వేకువనేలేచి పెద్దకొమారుని సహాయముతో బావిలోని నీళ్లంతయు తోడి చెట్లకుపోసి ఆవెనక పిల్లలకు విద్య నేర్పుదురు. పిల్లలందరూ పాఠశాలకుపోయినవెనుక మేము భోజనము చేసి రాట్నముపై నూలు తీయుదుము. పిల్లలు బడినుండి వచ్చినవెనక వారితో సంతోషముగా కొంతసేపుగడపి గృహకృత్యములందు నేనును తోటపనియందు వారును ప్రవేశింతుము ఇవి మా నిత్యకృత్యములు. మాయింటికగు కాయగూరలు మేమే పండించుకొందుము. పెరుగుపాలు నెయ్యి కొనవలసిన యగత్యములేదు, సరిగదా మా కెక్కువగు పాల నిరుగుపొరుగువారికిఖరీదున కమ్మి యాధనమువలన పశువులమేతకొనుచుందుము. మాపెరటిలోనున్న ప్రత్తిచెట్లవలన కొంతదూదివచ్చును. అది చాలనందున కొంతకొని దానిలో నూలురాట్నముపై తీసి మాకు కావలసిన వస్త్రములు నేయించుకొందుము. మాబిడ్డలు యేకులు చేయుదురు. పిల్లలగుడ్డలన్నియు నేనే కుట్టుదును. నూనె మొదలగు కొన్నివస్తువులుతప్ప మేమెదియు బజారునుండికొనము. ఇందువలన యాడంబరముగ కాకున్నను యన్నవస్త్రములకు లోటులేకుండ శాంతముగ జీవించుచున్నాము. ప్రధమమున నా భర్తగారు యీపనులన్నియు మనము చేయగలమాయని భయపడిరి. మీరు ధైర్యముతో కార్యక్రమమునకు పూనుకొనుడు. రాత్రింబగళ్లు న్యాయశాస్త్రములు చదివి కష్టపడిన దానికన్న యిదియేమనకు సుఖజీవనోపాయము. ప్రస్థుతకాలపు నాగరికతావ్యామోహము విడిచిపెట్టుడని వారికిబోధించి వారిచే యీవిధముగ జేయుట కొప్పించితిని. ఉప్పుడు కొంతధనముచేర్చి పెద్దయిల్లు కట్టించుటకు చూచుచున్నాము.”

ఇది యంతయు జెప్పి యామె నాకు యిల్లంతయుజూపించెను పట్టణవాసులగు ధనవంతుల యిండ్లలోవలె వెలగల చిత్రవిచిత్రములగు విదేశవస్తు సముదాయము లేవియులేకున్నను సంసారమునకు కావలసిన వస్తువులన్నియు వారింటనున్నవి. ఇల్లు చూచుటకు ముచ్చటగునట్లు పరిశుభ్రముగ నున్నది ఆమెకు ముగ్గురుపుత్రులు. ముగ్గురు పుత్రికలు. బిడ్డలందరు విద్యాభ్యాస మొనర్చుచున్నారు. ప్రతిగృహిణియు యీవిధమున భర్తలకు సహాయముచేసిన సంసారములందు దారిద్ర్యము కొంతతొలగిపోవునేమో. పాఠకసోదరీమణు లీకథ కల్పితమని యెంతురేమో. కల్పితముగాదు. జరిగిన కథయే. నేటికి పదిసంవత్సరముల నాటి సంగతి యిది. ఇప్పుడీ పుణ్యకుటుంబ మెక్కడనున్నదో నాకు తెలియరాలేదు. నే నావూరువిడచినదిమొదలు లా ప్రక్కకు తిరిగిపోలేదు. ఎవ్వరినడిగినను వారిసంగతి సరిగాతెలియదని కొందరు వా రావూర లేరని కొందరనుచున్నారు. ఈమె చరితము గృహిణుల కాదర్శమగునేమోయని వ్రాయ సాహసించితిని. ధనవంతులకు గాదుసుమండీ. సామాన్యులకు.